

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం 12 ఆగస్టు 2021 | సంపుటి : 03 | సంచిక :09 | పేజీలు : 4 | వెల : రూ 3-00

# సీఎం జగన్‌ను కలిసిన భారత మహిళా హాకీ ప్లేయర్ రజనీ

**హాకీ ప్లేయర్ రజనీకి రూ. 25లక్షల నగదు ప్రోత్సాహకం**
**కుటుంబంలో ఒకరికి ఉద్యోగం**
**ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటన**





అమరావతి: ఒలింపిక్స్‌లో విశేష ప్రతిభ చూపిన భారత మహిళల జట్టు హాకీ క్రీడాకారిణి.. ఏపీకి చెందిన ఇ.రజనీ బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఎం జగన్ రజనీకి పలు ప్రోత్సాహకాలు ప్రకటించారు. రూ. 25లక్షల నగదుతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.క్యాంపు కార్యాలయంలో తల్లిదండ్రులతో కలిసి రజనీ సీఎం జగన్‌ను కలిశారు. రజనీని ముఖ్యమంత్రి శాలువాతో సత్కరించి అనంతరం ఆమెకు జ్ఞాపికను బహూకరించారు. గత ప్రభుత్వంలో రజనీకి ప్రకటించి.. పెండింగ్‌లో ఉంచిన బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిలో 1000 గజాల నివాస స్థలం, నెలకు రూ. 40 వేల చొప్పున ఇన్సెంటివ్‌లు కూడా ఇవ్వాలని సీఎం అధికారు లను ఆదేశించారు. రజనీ స్వగ్రామం చిత్తూరు జిల్లా ఎర్రావారిపాలెం. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఒలంపిక్స్ హాకీలో పాల్గొన్న ఏకైక క్రీడాకారిణిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. 2016లో జరిగిన రియో ఒలంపిక్స్‌తో పాటు టోక్యో ఒలంపిక్స్ 2020లో పాల్గొన్న క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. భారత్ తరపున 110 అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లలో పాల్గొన్న రజనీ గోల్ కీపర్‌గా మంచి ప్రతిభ కనపరి చింది. టోక్యో ఒలిపింక్స్‌లో కాంస్య పతక పోరులో మహిళల హాకీ జట్టు ఓటమి పాలైనప్పటికి భారత అభిమానుల మనసు లు మాత్రం గెలుచుకున్నారు.ఈ కార్యక్రమ ంలో రజనీ కుటుంబ సభ్యులు, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ భార్గవ, శాప్ వీసీ అండ్ ఎండీ ఎన్.ప్రభాకర్ రెడ్డి, శాప్ అధికారులు రామకృష్ణ, జూన్ గ్యాలట్, రాజశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గతంలో రజని సాధించిన ప్రతిభకు కూడా...: మంత్రి అవంతి


అమరావతి: ఆంధ్రప్రదేశ్ నుండే కాకుండా సౌత్ ఇండియా నుండి భారత జట్టుకు రజని ప్రాతినిధ్యం వహించారని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. తిరుపతి వద్ద బకారా పేటకు చెందిన రజని నేడు సీఎంను కలిశారని తెలిపారు. మన జాతీయ క్రీడ



హాకీలో ఒలెంపిక్స్‌లో పార్టిసిపేట్ చేసిన రజనిని సీఎం అభినందించారని చెప్పారు. పాలసీ ప్రకారం ఒలెంపిక్స్‌లో పాల్గొన్నందుకు 25 లక్షలు అందచేస్తున్నామన్నారు. గతంలో ఆమె సాధించిన ప్రతిభకు ఇవ్వాల్సిన 62.5 లక్షలు కూడా రేపు ఉదయానికి ఇస్తామన్నారు. రజని కుటుంబం నుంచి మరో వ్యక్తికి ముందుగా ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇచ్చి తరువాత పెర్మినెంట్ చేయాలని అదేశించారు. తిరుపతిలో గతంలో ఇచ్చిన 1000 గజాల స్థలాన్ని వీరికి పొజిషన్ ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ముహాకీ ట్రెనింగ్‌కి నెలకు రూ.40వేలు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్పాన్సర్ షిప్ ఇస్తున్నామన్నారు.

## రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది: నక్కా ఆనందబాబు

గుంటూరు: వైసీపీ ప్రభుత్వ అవగాహన లోపం వల్ల డెల్టా రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు అన్నారు. నిండుకుండల్లా ఉన్న ప్రాజెక్టు ల్లోని నీరు అంతా సముద్రం పాలుచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం జూలై నెలలో సాగుకు నీరు అందించిందన్నారు. జగన్ ప్రభుత్వం రైతులకు సాగు నీరు ఇవ్వడంలో విఫలమైందని పేర్కొన్నారు. పులిచింతల ప్రాజెక్టు నిర్వహణ లోపం వల్ల గేట్లు విరిగి నీరంతా సముద్రంపాలైందని చెప్పారు. డెల్టాలో నారుమడులు ఎండిపోతున్నాయని చెప్పారు. వరహాపురం, నల్లూరివారిపాలెం రైతులు కాల్వల్లో కూర్చుని నిరసన చేశారని తెలిపారు. స్దానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతుల విషయంలో సిగ్గు పడాలన్నారు. డెల్టా ప్రాంతంలో 96 వేల ఎకరాల్లో 50 వేల ఎకరాలకు నీరందే పరిస్థితి లేదని ఆయన చెప్పారు. కాల్వల మరమ్మత్తుల పేరుతో వైసీపీ నేతలు కోట్లు దండుకున్నారని ఆరోపించారు. డెల్టా రైతంగానికి తక్షణమే నీరు విడుదల చేయ్యకపోతే ఉద్యమానికి శ్రీకారం చుడతామని తెలిపారు.



# కోవిడ్ నివారణ, డిజిటల్ హెల్త్‌పై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: రాష్ట్రంలో కోవిడ్ నివారణ చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, కోవిడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. టీచర్లు సహా, స్కూళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి వ్యాక్సినేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలు యూనిట్‌గా పరిగణలోకి తీసుకుని వ్యాక్సినేషన్ ఇవ్వాలని తెలిపారు.దీనివల్ల క్రమబద్ధంగా, ప్రాధాన్యత పరంగా వ్యాక్సినేషన్ ఇచ్చినట్టు అవుతుందని, తద్వారా వ్యాక్సిన్లు వృధా కాకుండా మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. 18 నుంచి 44 ఏళ్ల మధ్యనున్న వారికి కూడా వ్యాక్సిన్లు ఇవ్వాలి కాబట్టి దీనిపై కార్యాచరణ రూపొందించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఎక్కువ ప్రజా బాహుళ్యంతో సంబంధాలు ఉన్నవారు, ఉద్యోగులు, సిబ్బందికి అధిక ప్రాధాన్యత ఇచ్చే దిశగా ఆలోచనలు చేయాలని ఆయన చెప్పారు.అనంతరం డిజిటల్ హెల్త్‌పై సమీక్షించిన సీఎం.. ఆరోగ్యశ్రీ కార్డులో కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలు క్యూఆర్ కోడ్ రూపంలో అందుబాటులో ఉండాలన్నారు. విలేజ్ క్లీనిక్స్‌లో కూడా డేటా వివరాల నమోదుతో పాటు ప్రతి విలేజ్, వార్డు క్లీనిక్స్‌లో కూడా కంప్యూటర్ ఉండాలని అధికారులను ఆదేశించారు. విలేజ్ క్లీనిక్స్‌లో సాధారణ పరీక్షలు చేసే పరిస్థితి రావాలని, షుగర్, బీపీ, బ్లడ్ గ్రూప్ సహా ఇతర వివరాలు కార్డులో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో కుటుంబానికి కాకుండా విడివిడిగా వ్యక్తుల పేరుపై ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చే దిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు.ఆరోగ్యశ్రీ, ఆధార్ నెంబర్ చెప్పినా వెంటనే ఆరోగ్య వివరాలు వచ్చే విధానం తీసుకురావాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. తల్లులు, పిల్లల ఆరోగ్యంపై విలేజ్ క్లీనిక్స్ దృష్టిపెడుతున్నాయి, అదే క్రమంలో గ్రామాల్లో కాలుష్య నియంత్రణపై కూడా దృష్టిపెట్టాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల పరిస్థితులపై పర్యవేక్షణ చేయాలని, ఈ క్రమంలోనే విలేజ్ క్లీనిక్స్ నుంచి టీచింగ్ ఆస్పత్రుల్లో రిక్రూట్‌మెంట్‌పై దృష్టిపెట్టాలని సీఎం పేర్కొన్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని రిక్రూట్‌మెంట్ చేయాలని, మూడు నెలల్లో సిబ్బంది భర్తీ ప్రక్రియ పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పీహెచ్‌సీ నుంచి పైస్థాయి ఆస్పత్రులకు కూడా కాంపౌండ్‌వాల్ ఉండాలని తెలిపారు.

# ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో మరో షాక్..

**అశోక్ గజపతిరాజుకు గ్రీన్ సిగ్నల్**




అమరావతి: ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మాన్సాస్ చైర్మన్‌గా కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు కొనసాగింపునకు హైకోర్టు గ్రీన్ సిగ్నలిచ్చింది. అశోక్‌గజపతిరాజును పునర్ నియమిస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం, సంచయిత గజపతిరాజు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. సీజే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్‌లో పిటిషన్లపై విచారణ జరిగింది. ప్రభుత్వం, సంచయిత వేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. మాన్సాస్ చైర్మన్‌గా అశోక్‌గజపతిరాజు కొనసాగుతారని సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సీజే బెంచ్ సమర్థించింది.గతంలో అశోక్ గజపతిరాజుపై రాష్ట్ర ప్రభుత్వం రహస్య ఉత్తర్వులతో విరుచుకుపడింది. ఆయనను సింహాచల దేవస్థానం చైర్మన్‌గా తొలగించింది. అలాగే... విజయనగరం సంస్థానాధీశులకు చెందిన మహారాజా అలక్ నారాయణ్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్(మాన్సాస్) ట్రస్టు అధ్యక్ష పదవి నుంచి తప్పించింది. ఈ రెండు పదవుల్లో ఆయన అన్న, మాజీ మంత్రి పూసపాటి ఆనంద గజపతిరాజు కుమార్తె సంచయిత గజపతిరాజును నియమిస్తూ అర్ధరాత్రి రహస్య ఉత్తర్వులిచ్చింది.ప్రభుత్వం జీవోపై అశోక్ గజపతిరాజు హైకోర్టును ఆశ్రయించారు. మాన్సాస్ ట్రస్ట్, సింహాచలం దేవస్థానం చైర్‌పర్సన్‌గా సంచయిత గజపతి నియామక జీవోను హైకోర్టు సింగిల్ బెంచ్ కొట్టివేసింది. అశోకగజపతిరాజును పునర్నియమించాలంటూ ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ క్రమంలో ప్రభుత్వం మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా..న్యాయస్థానం అశోక్ గజపతిరాజుకు అనుకూలంగా తీర్పువెలువరించింది.

# 'విద్యావిధానంలో చేసిన మార్పులు, సంస్కరణలు దేశానికే తలమానికం'

**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్**



నూజివీడు: మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యాలయాల్లో ఉన్న కోర్సులను మార్పులు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆయన బుధవారం నూజివీడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో డిగ్రీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్థులతో 'ఇంటర్న్ షిప్'ని చేయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు.గడిచిన రెండేళ్లలో విద్యావిధానంలో చేసిన మార్పులు, సంస్కరణలు దేశానికే తలమానికంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీ వ్యవస్థను కార్పొరేట్ విద్యా సంస్థలు నిర్వీర్యం చేశాయని పేర్కొన్నారు. నూజివీడులో ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్‌ను అటామనస్ ఇనిస్టిట్యూట్‌గా గుర్తించి యూనివర్సిటీతో సంబంధం లేకుండా స్వయం ప్రతిపత్తి హోదాతో అభివృద్ధి చేయాలని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ని మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు.

# 'శ్రీవారికి ప్రథమ సేవకుడిగా అవకాశం.. నా పూర్వజన్మ అదృష్టం'

తిరుమల: టిటిడి ధర్మకర్తల మండలి చైర్మన్గా వైవీ సుబ్బారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతూ.. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రథమ సేవకుడిగా రెండో సారి అవకాశం రావడం తన పూర్వజన్మ అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. గత రెండేళ్లుగా సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ.. మెరుగైన సౌకర్యాలు కల్పించామని ఆయన తెలిపారు. సామాన్య భక్తులకు శీఘ్రంగా స్వామి వారి దర్శనం కల్పించడంలో విజయవంతం అయ్యామని అన్నారు.తిరుమలలో చారిత్రాత్మక నిర్ణయాలు, మార్పులు తీసుకు రావడంతో పాటు వాటిని అమలు చేసామని ఆయన పేర్కొన్నారు. కరోనా మహమ్మారి కారణంగా ప్రజలంతా ఇబ్బందులకు గురి అవుతున్న సమయంలో దర్శనాలు కూడా కుదించాల్సి వచ్చిందని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. తిరుమలలో



ప్లాస్టిక్ పూర్తిగా బ్యాన్ చేసి పర్యావరణ పరిరక్షణ దిశగా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించే విధంగా డీజిల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించనున్నామని టీటీడీ చైర్మన్ వెల్లడించారు. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే భక్తులు ఎలక్ట్రిక్ వాహనాల్లో ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. వెయ్యేళ్ల కిందట ప్రకృతి సిద్ద వ్యవసాయం ఆధారంగా పండించిన ధాన్యాలతో శ్రీవారికి నైవేద్యం సమర్పించే వారని, మళ్లీ 100 రోజులుగా తిరిగి ఆ విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు.

# ఏపీలో 1,869 కరోనా పాజిటివ్ కేసులు నమోదు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో 1,869 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 71,030 శాంపిల్స్ పరీక్షించగా 1,869 మంది కొవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారింపబడ్డారు. కాగా కొవిడ్-19తో 18 మంది చనిపోయారు. 2,316 మంది వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్నారు. తాజా కేసులతో కలుపుకుని ఏపీలో కరోనా కేసుల సంఖ్య 19,84,156 కు చేరింది. వీటిలో యాక్టివ్ కేసుల సంఖ్య 18,417గా ఉంది.జిల్లాల వారీగా నమోదైన కొవిడ్-19 మరణాల వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో ఐదుగురు, కృష్ణాలో ముగ్గురు, ప్రకాశంలో ముగ్గురు, గుంటూరులో ఇద్దరు, అనంతపూర్, తూర్పుగోదావరి, నెల్లూరు, విశాఖపట్నం, పశ్చిమగోదావరిలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు.



# సంపాదకీయం

గురువారం 12 ఆగస్టు 2021

## ప్రపంచ ఆధిపత్యం కోసం జింగ్ పింగ్ తాపత్రయం

చైనా అధినేత అంతర్జాతీయంగా కీలకమైన నాయకుడు. ఆయన మాటలకు, చేతలకు, పర్యటనలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా గల దేశాధినేతగా, ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగల అధినేతగా, భద్రతామండలిలో గల అయిదు శాశ్వత సభ్యత్వ దేశాల్లో ఒకటిగా చైనా అధినేత నిస్సంహదేహంగా కీలకమైన నాయకుడు. అమెరికా అధ్యక్షుడికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో, చైనా అధినేతకూ దాదాపు అదే ప్రాధాన్యత ఉంటుంది. దేశాధినేతగా, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, పీఎల్ఏ (పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) అధిపతిగా చక్రం తిప్పుతున్న షి జిన్ పింగ్ ఎవరు కాదన్నా ఔనన్నా అంతర్జాతీయంగా శక్తిమంతమైన నాయకుడు అనడంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు ఉండక్కర్లేదు. ఇటీవల జులై 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు టిబెట్ లో జిన్ పింగ్ పర్యటన చైనాలోనే కాకుండా అంతర్జాతీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. టిబెట్ ?చైనాలోని స్వయం ప్రతిపత్తి గల ప్రావిన్స్. భారత్ లోని అరుణాచల్ ప్రదేశ్ కు అతి సమీపంలో ఉండే టిబెట్ 1950ల్లో చైనా పరమైంది. టిబెట్ ? చైనాలో అంతర్భాగమన్న విషయాన్ని భారత్ సైతం అధికారికంగా గుర్తించింది. అంతర్జాతీయ సమాజానిదీ అదే అభిప్రాయం. అయితే భారత్ లోని బౌద్ధ మతం గురువు దలైలామా వంటి వారు అప్పుడప్పుడూ టిబెట్ గురించి మాట్లాడటం వల్ల ఈ ప్రాంతం వార్తల్లోకి ఎక్కుతుంటోంది. తాజాగా జిన్ పింగ్ టిబెట్ పర్యటన అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించింది. దీనికి కారణాలు లేకపోలేదు. మూడు దశాబ్దాల తరవాత టిబెట్ ను సందర్శించిన తొలి చైనా అధినేతగా జిన్ పింగ్ గుర్తింపు పొందారు. గతంలో అంటే 1991లో అప్పటి అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ తరవాత టిబెట్ లో పర్యటించిన తొలి బీజింగ్ అధినేత జిన్ పింగ్ కావడం విశేషం. భారత్ లోని తూర్పు లద్దాఖ్ కు అత్యంత సమీపంలో టిబెట్ ఉంటుంది. ఏడాది కాలంగా ఈ ప్రాంతంలో రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే. గత ఏడాది జూన్ లో జరిగిన ఘర్షణల్లో 20 మంది భారతీయ సైనికులు అమరులయ్యారు. చైనావైపు సైతం భారీ నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో జిన్ పింగ్ పర్యటన కీలకంగా మారింది. టిబెట్ లోని నియింగ్చి విమానాశ్రయంలో కాలుమోపిన జిన్ పింగ్ అక్కడి నుంచి యార్లుంగ్ జాంగ్బో నదిపై నిర్మించిన వంతెనను పరిశీలించారు. నియింగ్చి విమానాశ్రయం మన అరుణాచల్ ప్రదేశ్ కు కేవలం 21 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. యార్లుంగ్ జాంగ్బో నదినే భారత్ లో బ్రహ్మపుత్ర నది అని పిలుస్తారు. టిబెట్ నుంచి అరుణచాల్ ప్రదేశ్, అసోం మీదుగా ప్రవహించే ఈ నది బంగ్లాదేశ్ లో బంగాళాఖాతంలో సంగమిస్తుంది. ఈ నదిపై చైనా అనేక వివాదాస్పద ప్రాజెక్టులను నిర్మిస్తూ భారత్ నీటి వాటాకు గండి కొడుతోంది. అనంతరం జిన్ పింగ్ కొత్తగా నిర్మించిన సిచువాన్ ? లాసా రైల్వే లైనును పరిశీలించారు. లాసా టిబెట్ రాజధాని నగరం. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ఈ మార్గంలో రైళ్లు ప్రయాణిస్తాయి. గత కొంతకాలంగా చైనా తమను అణచివేస్తుందన్న భావన టిబెట్ ప్రజల్లో ఉంది. బలవంతంగా చైనా సంస్కృతిని తమపై రుద్దుతున్నారన్న భావన వారిలో ఉంది. స్థానిక భాష బదులు చైనా అధికారిక భాష అయిన 'మాండరిన్' నేర్చుకోవాలన్న ఒత్తిడి వారిపై చేస్తున్నారు. చైనా సైన్యంలో చేరాలన్న ఒత్తిడి కూడా వారిపై ఉంది. తమను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నాన్న అనుమానం వారిలో ఉంది. ఈ నేపథ్యంలో టిబెట్ ప్రజలను ప్రసన్నం చేసుకునేం దుకు, వారికి గల అనుమానాలు, అపోహలను తొలగించేం దుకు జిన్ పింగ్ పర్యటించారన్న వాదనలు వినపడుతు న్నాయి. సరిహద్దుల్లో ఉభయ దేశాల మధ్య విస్తరించిన 3,488 కిలోమీటర్లు గల వాస్తవాధీన రేఖ వెంట తాజాగా రెండు దేశాలు భారీగా బలగాలను మోహరించిన తరుణంలో చైనా అధినేత పర్యటనను భారత్ నిఘావర్గాలు నిశితంగా గమనించాయి.

# కమలం గూటికి జేసీ....



అనంతపురం, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లాలో తనకంటూ.. ప్రత్యేక ముద్ర వేసుకున్న జేసీ దివాకర్ రెడ్డి తాడిపత్రి నియోజకవర్గం నుంచి 35 సంవత్సరాలు ఎమ్మెల్యేగా కొనసాగారు. వరుస విజయాలు.. ఆయనను జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక నాయకుడిగా ముద్ర వేసుకునేలా చేశాయి. అయితే.. గత ఎన్నికలకు ముందు.. ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్ బై చెప్పిన జేసీ దివాకర్ రెడ్డి తన కుమారుడు.. పవన్ రెడ్డిని అనంతపురం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించారు. అయితే.. ఆయన ఓడిపోయారు. ఇక, అప్పటి నుంచి పవన్ ఒకింత యాక్టివ్‌గానే ఉన్నప్పటికీ.. టీడీపీ వ్యవహార శైలిపై జేసీ దివాకర్ రెడ్డి గుస్సాగా ఉన్నారు. తమకు ప్రాధాన్యం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తమపై ఉన్న కేసులు, ఇతరత్రా ఆర్థిక లావాదేవీలు వంటి విషయాల్లో ఇబ్బందులను అధిగమించేందుకు జేసీ దివాకర్ రెడ్డి బీజేపీలోకి చేరాలని భావిస్తున్నారు. కొన్నాళ్లుగా ఆయన కేంద్రంలోని బీజేపీ పెద్దలతో టచ్‌లో ఉంటున్నట్టు వార్తలు కూడా వస్తున్నాయి. సీమలో బీజేపీకి సానుభూతి ఉంది. పైగా ప్రత్యేక సీమ ఉద్యమానికి.. ఇక్కడి బీజేపీ నేతలు కొన్నాళ్ల మద్దతు కూడా పలికారు. అదే సమయంలో కర్నూలులో రాష్ట్ర హైకోర్టు ఏర్పాటుకు కూడా బీజేపీ మొగ్గు చూపుతోంది. ఎన్నికల మేనిఫెస్టోలోనూ దీనిని చేర్చింది. ఈ క్రమంలో బీజేపికి ఇక్కడ బాగానే ఫాలో అప్ ఉంది. ఈ క్రమంలో బీజేపీలో చేరితే తనకు బాగానే ఉంటుందని జేసీ దివాకర్ రెడ్డి భావించారు. దీనికి సంబంధించి ఆయన నేరుగా కేంద్రంలో ఉన్న పరిచయాల నేపథ్యంలో బీజేపీ పెద్దల ముందు .. ఒక ప్రతిపాదన పెట్టినట్టు కొన్నాళ్లుగా ప్రచారంలో ఉంది. రాజ్యసభకు తనను ప్రమోట్ చేయాలని ఆయన కోరుతున్నారు. అయితే.. దీనిపై నిన్న మొన్నటి వరకు మౌనంగా ఉన్న బీజేపీ పెద్దల నుంచి తాజాగా జేసీ దివాకర్ రెడ్డికి ఆసక్తికర సమాచారం వచ్చింది. "పార్టీని డెవలప్ చేయండి.. పదవులు మీరు కోరుకున్నట్టుగానే వస్తాయి. కానీ, ఇప్పుడే కాదు" అని సీమకు చెందిన కీలక నేత ఒకరు జేసీ దివాకర్ రెడ్డిని కలిసి కేంద్రం నుంచి వచ్చిన సమాచారాన్ని అందించారు. దీనిపై ఇప్పుడు ఆయన తర్జన భర్జన పడుతున్నారు. వయసు రీత్యా చూస్తే.. ఆయనకు తక్షణమే పదవి కావాలనేది ఆయన వాదనగా ఉంది. కానీ, బీజేపీ పరంగా చూస్తే.. చాలా మంది నేతలు పదవుల కోసం లైన్‌లో ఉన్నారు. ఈ క్రమంలో రాజ్యసభ ఇస్తారనే ఆశ వదులుకుని.. పార్టీలో చేరితే.. ఎప్పటికి గుర్తింపు లభిస్తుందోననిజేసీ దివాకర్ రెడ్డి తర్జన భర్జన పడుతున్నారు. అయితే.. బీజేపీ నేతల మధ్య మాత్రం ఆయన పార్టీలోకి చేరితే.. రెండేళ్లలో ఆయనను గవర్నర్‌గా నియమించినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని.. సీమకు బీజేపీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రచారం చేసుకునేందుకు బీజేపీ పెద్దలు ఈ దిశగా కూడా ఆలోచించే అవకాశం ఉందని.. రాజకీయంగా సీనియర్ మోస్ట్ అయిన జేసీ దివాకర్ రెడ్డి వల్ల బీజేపీకి లబ్ధి చేకూరితే.. ఆయన ఎలాంటి పదవినైనా ఇవ్వొచ్చని అంటున్నారు. మరి ఆయన ఏం చేస్తారో చూడాలి.

# నియోజకవర్గాల్లో దిక్కెవరు...

విజయవాడ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)టీడీపీ అధినేత చంద్రబాబు 2024 ఎన్నికలకు నెమ్మదిగా రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గత సాధారణ ఎన్నికల తర్వాత పలువురు కీలక నేతలు పార్టీ మారిపోవడం? కొందరు కాడి కింద పడేయడంతో 30 నియోజకవర్గాలకు పార్టీ ఇన్చార్జ్‌లు లేకుండా పోయారు. పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎవరు లేకపోవడంతో ఆ నియోజకవర్గాల్లో టీడీపీకి దిక్కు దివాణం లేకుండా పోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో అధికారం అందని ద్రాక్ష అవుతుందని భావించిన చంద్రబాబు ఆ నియోజకవర్గాల్లో బలమైన ఇంచార్జ్ లను సెట్ చేసుకుంటూ వస్తున్నారు. గత రెండు నెలల్లోనే పది నియోజకవర్గాలకు కొత్త నేతలు వచ్చారు. అయితే పశ్చిమ గోదావరి జిల్లాలో కీలకమైన కొవ్వూరు నియోజకవర్గం బాధ్యతల విషయంలో మాత్రం చంద్రబాబు సంకటస్థితికి ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నుంచి 2014 ఎన్నికల్లో పోటీ చేసిన కేఎస్ జవహర్ ఆ తర్వాత మంత్రిగా కూడా పనిచేశారు. జవహర్ మంత్రి అయ్యాక కొవ్వూరు నియోజకవర్గంలో టిడిపి రాజకీయాలను శాసించే పెండ్యాల అచ్చిబాబు? కొందరు కమ్మ సామాజిక వర్గం నేతలు జవహర్ కు వ్యతిరేకం అయిపోయారు. మంత్రిగా జవహర్ పార్టీ తరపున బలమైన వాయిస్ వినిపించారు. ఎస్సీ నేతల్లో ఇంత తక్కువ టైంలో అంత కీలకంగా ఎదిగిన నేత ఆయన ఒక్కరే. పెద్దగా వివాదాల్లోనూ ఉండరు. గత ఎన్నికల్లోనూ ఆయన అక్కడే పోటీ చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేసినా కమ్మ సామాజిక వర్గ నేతల లాబీయింగ్ కు చంద్రబాబు తలొగ్గక తప్పలేదు. చివరకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక జవహర్‌ను కృష్ణా జిల్లాలోని తిరువూరు ( జవహర్ సొంత నియోజకవర్గం) నుంచి పోటీ చేయించి? అప్పుడు విశాఖ జిల్లాలోని పాయకరావుపేట ఎమ్మెల్యేగా ఉన్న వంగలపూడి అనిత కొవ్వూరు బరిలో దింపారు. గత ఎన్నికల్లో కొవ్వూరు, తిరువూరు రెండు చోట్ల టిడిపి ఓడిపోయింది. తిరువూరులో గట్టిపోటీ ఇచ్చిన జవహర్ గత ఎన్నికలు ముగిసినప్పటి నుంచి కొవ్వూరుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తూనే వస్తున్నారు. తాజాగా తిరువూరుకు దేవదత్తను కొత్త ఇన్చార్జిగా చంద్రబాబు ప్రకటించారు. అంతకుముందే పార్టీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులను చంద్రబాబు ప్రకటించినప్పుడు జవహర్ ను వ్యూహాత్మకంగా రాజమహేంద్రవరం పార్టీ అధ్యక్షుడిగా ప్రకటించారు. అప్పుడే జవహర్‌కు కొవ్వూరు ఇంచార్జి ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే పార్టీలో ఉన్న స్థానిక నేతలు చంద్రబాబుపై లాబీయింగ్ ప్రారంభించడంతో చంద్రబాబు మౌనంగా ఉంటూ వస్తున్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోనే కొవ్వూరు అసెంబ్లీ కూడా ఉంది. అటు జవహర్ ఇక్కడ పార్లమెంటరీ అధ్యక్షుడుగా ఉండడంతో పాటు..

ఇటు తిరువూరుకు కొత్త ఇన్చార్జిని ప్రకటించడంతో కొవ్వూరు బాధ్యతలు జవహర్‌కు అప్పగించటం మిగిలి ఉంది. అయితే కొవ్వూరు నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్న పెండ్యాల అచ్చిబాబు చంద్రబాబుకు ఎంతో సన్నిహితుడు. టీడీపీ ఆవిర్భావం నుంచి పెండ్యాల ఫ్యామిలీ కొవ్వూరు రాజకీయాలను శాసిస్తోంది. చంద్రబాబు ఆయన్ను కాదనే పరిస్థితి లేదు. అయితే జవహర్ మంత్రిగా ఉన్నప్పుడు ఏర్పడిన గ్యాప్ నేపథ్యంలో అచ్చిబాబు వర్గం మళ్లీ ఇప్పుడు వ్యతిరేకంగా పావులు కదపడం ప్రారంభించింది. జవహర్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ కొవ్వూరు పగ్గాలు ఇస్తే సహించేది లేదని ఆ వర్గం తెగేసి చెబుతోంది. పార్టీ ప్రతిపక్షంలో ఉండడంతో చంద్రబాబు సైతం స్థానిక టిడిపి నేతల మాటను కాదనలేని పరిస్థితి. చంద్రబాబు ? లోకేష్ ఇద్దరు జవహర్‌కు కొవ్వూరు బాధ్యతలు ఇచ్చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. స్థానిక నేతల ఒత్తిడి మేరకే ఈ ప్రకటన వాయిదా వేస్తూ వస్తున్నారు. స్థానిక నేతలు మాత్రం తాము ఎట్టి పరిస్థితుల్లోనూ జవహర్‌ను ఇక్కడ ఒప్పుకోమని అంటున్నారు. మరి ఈ ఇద్దరిలో వచ్చే ఎన్నికల నాటికి ఎవరు రాజీ పడతారు ? చంద్రబాబు పార్టీని నమ్ముకున్న తన అప్తుడుకు ? న్యాయం చేస్తారా ? లేదా తన వర్గం నేతల ఒత్తిడికి లొంగి పోతారా అన్నది చూడాలి.

# మన్సాస్ పార్ట్ 3

## ఉక్కిరిబిక్కిరవుతున్న రాజుగారు

విజయనగరం, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)విజయనగరం జిల్లా మాన్సాస్ ట్రస్ట్ వివాదంలో మరో కొత్త మలుపు చోటు చేసుకుంది. ఇంతవరకూ అశోక్ గజపతిరాజుతో సన్నిహితంగా ఉంటూ వచ్చిన ఆయన అన్న కూతురు ఊర్మిళా గజపతిరాజు ఇపుడు చైర్ పర్సన్ సీటు తనకు కావాలని అంటున్నారు. తానే అసలైన వారసురాలిని అని కూడా ఆమె క్లైం చేస్తున్నారు. ఎందుకంటే ఆనందగజపతిరాజు రెండవ వివాహం చేసుకున్నారు. ఆయన చివరి రోజులలో రెండవ భార్య సుధా గజపతిరాజే దగ్గరుండి అన్ని సేవలూ చేశారు. ఇక లీగల్ గా చూసినా రెండవ భార్య సంతానానికి అన్ని రకాల హక్కులు ఉన్నాయని అంటున్నారు. దాంతో మాన్సాస్ ట్రస్ట్ బైలాస్ ప్రకారం చూస్తే పెద్ద కుమారుడి వారసులకే ఈ పదవి దక్కుతుంది కాబట్టి తనకే చైర్ పర్సన్ ఇవ్వాలని ఆమె తాజాగా హై కోర్టులో కేసు వేశారు. ఇదిలా ఉంటే ఇంతదాకా అశోక్ గజపతిరాజు వర్సెస్ సంచయిత అన్నట్లుగా వ్యవహారం సాగింది. బాబాయ్ ని పక్కన పెట్టేసి ఏడాది పాటు మాన్సాస్ ట్రస్ట్ చైర్ పర్సన్ గా సంచయిత రాజ్యం చేశారు. ఆమెకు వైసీపీ సర్కార్ దన్ను కూడా బాగా ఉంది. అయితే అశోక్ గజపతిరాజు కోర్టులో ఆమె నియామకాన్ని సవాల్ చేసి మరీ తన కుర్చీని తాను సాధించుకున్నారు. ఇక మాన్సాస్ భూముల మీద వివాదం అలాగే ఉంది. సింహాచలం దేవస్థానం భూముల విషయంలోనూ ప్రభుత్వం విచారణ జరిపించి ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసింది. ఆ విషయం అలా ఉండగానే ఇపుడు మళ్లీ వారసత్వ పోరు తెరపైకి వచ్చింది. ఈసారి ఊర్మిళా గజపతిరాజు న్యాయ పోరాటం చేస్తున్నారు.

దాంతో సంచయిత ఇక తెర వెనకకు వెళ్ళిన మాజీ చైర్ పర్సన్ అవుతారా అన్న చర్చ అయితే ఉంది. ఆనందగజపతిరాజు మొదటి భార్య ఉమకు విడాకులు ఇచ్చారు. దాంతో సంచయితకు హక్కులు ఉండవని అంటున్నారు. ఇక రెండవ భార్య సంతానం అయిన ఊర్మిళ తన తండ్రి వారసత్వంగా వచ్చిన ట్రస్ట్ కి చైర్ పర్సన్ అయ్యేందుకు ఎలాంటి అడ్డంకులు లేవు అని ఆమె తరఫున లాయర్లు అంటున్నారు. ఇదే వాదనను వారు కోర్టుకు వినిపించబోతున్నారు. అంటే ఇంటికి ఎవరు పెద్దగా ఉంటారో వారి సంతానమే భావి వారసులు అన్నదే ఇక్కడ లాజిక్ పాయింట్. ఇక అశోక్ గజపతిరాజు పెద్దవారు, మగ వారు మాత్రమే మాన్సాస్ ట్రస్ట్ చైర్ పర్సన్ గా ఉండాలి అంటూ బైలాలో ఉందని చెప్పి తన పదవిని తెచ్చుకున్నారు. ఒకవేళ అలాగే అనుకున్నా అశోక్ గజపతిరాజు కి కూడా ఆడపిల్లలే ఉన్నారు. మరి మగవారు లేని కారణంగా అశోక్ గజపతిరాజు తరువాత ఎవరు ట్రస్ట్ చైర్ పర్సన్ అవుతారు అన్న ప్రశ్న ఎటూ ఉంది. దాంతో ఆ నిబంధన లింగ వివక్షకు దారితీస్తోందని, అది తప్పు అన్న వారూ ఉన్నారు. ఈ పాయింట్లతోనే ఇపుడు ఊర్మిళ న్యాయం కోరుతున్నారుట. మొత్తానికి అశోక్ గజపతిరాజు కి మనశ్శాంతి లేకుండా ఈ పరిణామాలు వరసబెట్టి జరుగుతున్నా యని అంటున్నారు. ఒక వైపు మాన్సాస్ లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపిస్తూ దర్యాప్తు అంటోంది.

# పోలవరం...లెక్క తేలదా

ఏలూరు, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)పోలవరం ప్రాజెక్ట్ ప్రతిపాదనకు మరో ఇరవై ఏళ్ళలో నూరేళ్ళు పూర్తి అవుతాయి. సరిగ్గా 1942లో పోలవరం ప్రతిపాదన వచ్చింది. మరి ఎనభైయేళ్ళుగా ఒక ప్రాజెక్ట్ కల సాకారం కాలేదు అంటే ఇది ప్రపంచ రికార్డుగానే చూడాలి. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ గా కేంద్రం ప్రకటించింది. దానికి ఏపీ చెల్లించిన మూల్యం అడ్డగోలు విభజన. ఇంత జరిగాక కూడా గత ఏడేళ్ళలో పోలవరం ప్రాజెక్ట్ ని పూర్తి చేయడానికి కేంద్రం ఆపసోపాలు పడుతోంది. నానా అవస్థలు పెడుతోంది. పోలవరం ప్రాజెక్ట్ కి సవరించిన అంచనాలు 55 వేల కోట్లు అన్నది రెండేళ్ల క్రితం నిర్ణయించినది. ఈ రోజు రేటుకు చూస్తే మరికొంత ఎక్కువ అవుతుంది. టెక్నికల్ కమిటీ ఆమోదించినా కూడా నిధులు ఇవ్వడానికి కేంద్రం మీనమేషాలు లెక్కవేస్తోంది అంటే ఇది అక్షరాలా అరవై వేల కోట్లకు ఎగబాకినా ఆశ్చర్యం లేదు. ఇక పోలవరానికి మొత్తం నిధులు కేంద్రం ఇస్తోంది అని ఏపీ బీజేపీ నేతలు గొప్పగా చెబుతూ ఉంటారు. మరి 55 వేల కోట్లలో ఇంతవరకూ ఇచ్చింది ఎంత అంటే 11 వేల కోట్లు. అంటే కచ్చితంగా 20 శాతం మాత్రమే అన్న మాట. దీని బట్టి లెక్క వేసుకుంటే పోలవరం నిజంగా పూర్తి అయ్యేటప్పటికి 2250 వచ్చేస్తుంది అంటున్నారు. ఏడేళ్ళకు 20 శాతం, మిగిలిన ఎనభై శాతానికి మరో 28 ఏళ్ళు అంటే 2050 వస్తుంది అంటున్నారు. ఈలోగా సవరించిన లెక్కలు అంచనాలు మారి లక్ష కోట్లకు చేరితే ఇక పోలవరాన్ని పూర్తి చేయడం ఆ దేవుడి వల్ల కూడా కాదు అంటున్నారు. ఈ దేశంలో అన్ని రాష్ట్రాల మాదిరిగా ఏపీ కాదా అన్నదే ప్రజల ప్రశ్న. తాము కోరుకోని విభజనను చేసి ఏపీకి తీరని నష్టం కలిగించారు. మరి దానికి ఎంతో కొంత ఊరటగా పోలవరాన్ని ఇచ్చారు. కనీసం అయిదారేళ్ల లోపు ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఇచ్చినా జనాలు సంతోషిస్తారు. కానీ ఇక్కడ లేనిది చిత్తశుద్ధి, ఉన్నది నిర్లక్ష్యం. అందులే పోలవరం ఏపీకి శాపంగా మారుతోంది. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో ఆర్ ఆర్ ప్యాకేజితో తమకు సంబంధం లేదు అన్నట్లుగా కేంద్రం వ్యవహరిస్తోంది. అంటే ఏకంగా 35 వేల కోట్లకు ఝలక్ ఇచ్చినట్లేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇక కేవలం ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి 20 వేల కోట్లను మాత్రమే తాము ఇస్తామని చెప్పకనే చెబుతున్నారు. అది కూడా వాయిదాల మీద వాయిదాలతో. అంటే రేపటి రోజున పోలవరం స్ట్రక్చర్ తో సహా పూర్తి అయినా కూడా పునరావాసం కల్పించి జనాలను తరలించకపోతే నీటిని ఎక్కడ స్టోరేజ్ చేస్తారు. పోలవరం కట్టి ఉపయోగం ఏంటి. దాని పరమార్థం ఎలా దక్కుతుంది. ఇవన్నీ ప్రశ్నలు. కానీ కేంద్రానికి ఇవి అనవసరం. తాము కట్టామా లేదా అన్నదే చూడమంటున్నట్లుగా సీన్ ఉంది. అందుకే 55 వేల కోట్లకు ఆమోదముద్ర పడడంలేదు అంటున్నారు. ఇదే కనుక నిజమైతే బీజేపీ ఇలా చేస్తే మాత్రం ఏపీకి ఇంతలా గొంతు కోసిన రికార్డు మరో సర్కార్ కి ఉండదనే చెప్పాలి. విభజన కంటే ఇది అతి పెద్ద పాపంగా కూడా చూడాలి.

# కమలం, ఫ్యాను...కలివిడిగా నేతలు

విజయవాడ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)రాజకీయాలు గణిత శాస్త్రం లెక్కలు కాదు అంటారు. కానీ ఒక్కోసారి రెండు రెండూ కలిస్తే నాలుగు అని కూడా చెప్పాలి. అంటే అపుడు గణితపు లెక్కలు కరెక్ట్ గానే సరిపోతాయి అన్న మాట. ఏపీలో జగన్, ఢిల్లీలో బీజేపీల మధ్య సంబంధాలు కూడా అలాంటివే. ఈ ఇద్దరూ కలసి ఉంటే ఎవరి స్థాయిలలో వారికి లాభమే. విడిపోతే మాత్రం భారీ నష్టం. మరి రాజకీయ తెలివిడితో అటూ ఇటూ ఆలోచన చేసేవారు ఉన్నారు. దాంతోనే విభేదాలు కొన్ని వున్నా సరే ఈ బంధం కొనసాగే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయని అంటున్నారు. బీజేపీకి ఇపుడు బ్యాడ్ పీరియడ్ స్టార్ట్ అయింది. అది ఇంకా పెరిగేదే తప్ప ఎక్కడా తగ్గే సూచనలు లేవు. అసలు బండారం 2022 ఎన్నికల తరువాత, ఆ మీదట జరిగే రాష్ట్రపతి ఎన్నికల తరువాత బయటపడుతుంది. బీజేపీ అంచనాలు తల్లకిందులు అయితే 2022 రెండవ అర్ధభాగం నుంచి పెను సవాళ్ళు ఎదురవడం ఖాయం. అపుడు చేతిలో రెండేళ్ల అధికారం ఉన్నా కూడా బీజేపీ చేతులూ కాళ్ళూ పూర్తిగా కట్టేసినట్లుగానే ఉంటుంది. ఇవన్నీ చాణక్య రాజకీయం తెలిసిన బీజేపీ పెద్దలకు అవగాహనలో లేవని ఎవరూ అనుకోరు. అందువల్ల ఇంతటి విపత్కర పరిస్థితుల్లో జగన్ వంటి నమ్మకమైన మిత్రుడు బీజేపీకి ఉండాల్సిందే అని కమలనాథులు గట్టిగా భావిస్తున్నారుట. ఇక జగన్ బీజేపీకి తలాఖ్ అంటే వచ్చే ఇబ్బందులు ఏంటి అంటే చాలానే అన్న జవాబు వస్తుంది. జగన్ మీద ఉన్న సీబీఐ కేసుల విచారణ ఇపుడు చాలా జోరు మీద సాగుతోంది. ఇవన్నీ ఒక కొలిక్కి రావడానికి వచ్చే ఏడాది పడుతుంది. అంటే జగన్ కి కూడా 2022 ఒక విధంగా పెను సవాళ్ళను విసిరే ఏడాదిగానే చెప్పుకోవాలి.

అక్రమాస్తుల కేసులో తీర్పు ఎలా ఉంటుందో తెలియదు. అప్పటికి ఇంకా రెండేళ్ల పాలన ఆయన చేతిలో ఉంటుంది. అందువల్ల జగన్ ఇపుడు కీలకమైన దశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు బీజేపీ అండదండలు పూర్తిగా అవసరం అని భావిస్తున్నారు. జగన్ కి బీజేపీకి కోపం ఉంది కానీ అది బంధం తెంచుకునేంత వరకూ దారితీయకపోవచ్చు అని అందుకే అంటున్నారు. ఇపుడున్న పరిస్థితులు విశ్లేషించుకుంటే ఎవరి పరిధిలో వారు ఉండాల్సిందే. పరిస్థితులు బలీయమైనవి కాబట్టే జగన్ తో బీజేపీ బంధాన్ని గట్టిపరుస్తాయని అంటున్నారు. పార్లమెంట్ లో జగన్ ఎంపీల చేత నిరసన కార్యక్రమాలు జరిపించడం వరకూ బాగానే ఉంది. అంతకు మించి ఆయన కఠిన నిర్ణయం వైపుగా అడుగులు వేయరు అంటున్నారు. అంటే బీజేపీకి రాజ్యసభలో బిల్లులకు మద్దతు ఇవ్వకుండా ఉండరు అంటున్నారు. ఇక బీజేపీ కూడా మిగిలిన ఎంపీల మాదిరిగా వైసీపీ వారి మీద తీవ్ర చర్యలకు ఉపక్రమించదు అని కూడా చెబుతున్నారు. మరో వైపు చూస్తే వయా మీడియాగా రెండు పార్టీల మధ్య అవసరమైన విషయాల్లో రాజీ కుదుర్చుకుని ముందుకు సాఫీగా సాగుతారు అంటున్నారు. మొత్తానికి జగన్ అవసరం బీజేపీకి, బీజేపీ అవసరం జగన్ కి ఉన్నాయన్నది కచ్చితమైన రాజకీయ విశ్లేషణ.

# ముంపు ప్రాంతాలకు పరిష్కారమెప్పుడు

రాజమండ్రి, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)పోలవరం ముంపుపై ఎందుకింత నిర్లక్ష్యమని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలవరం, పురుషోత్తపట్నం, పట్టిసీమ ప్రాజెక్టులపై సోమవారం జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసిన ఏ ఒక్క అధికారిపై చర్యలు తీసుకోకపోవడంపై ఎన్‌జిటి ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావరణ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘిం చడం సిగ్గు చేటని పేర్కొంది. పోలవరం కాఫర్ డ్యామ్ వల్ల ముంపు జరుగుతుంటే ఏం చర్యలు తీసుకున్నారని ఎపి ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పోలవరం ముంపుతో ప్రజలు సర్వస్వం కోల్పోతా రని పేర్కొంది. కేంద్ర పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి ఉల్లంఘనలపై చర్యలు తీసుకోకపోవడంపైనా తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కేసు ముగించాలన్న ఆతృత మాత్రమే సిపిసిబి నివేదికలో కనిపించిందే కానీ, చట్టబద్ధంగా నివేదిక ఇవ్వాలన్న చిత్తశుద్ధి కనిపించలేదని ఆగ్రహించింది. తనిఖీలకు వెళ్లిన అధికారులు వాస్తవాలను వెల్లడించడంలో విఫలమయ్యారని, ప్రభుత్వమే పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టులు చేపడితే ఎలా? అని విమర్శించింది. పర్యావరణ ప్రభావ అంచనాను తూతూ మంత్రంగా చేశారని, మూడేళ్ల నుంచి కాఫర్ డ్యామ్ వల్ల ముంపు జరుగు తున్నా పట్టించుకోకపోవడం దారుణమని ఎన్‌జిటి బెంచ్‌కు పిటిషనర్ పెంటపాటి పుల్లారావు తరపున న్యాయవాది శ్రావన్ కుమార్ నివేదించారు. మడిచర్ల సత్యనారాయణ, జమ్ముల చౌదరయ్య దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్‌జిటిలో విచారణ జరిగింది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం తాత్కాలికమే, పంపులు వేరే చోటుకు తరలించడం లేదా వేలం వేస్తామని ఎపి ప్రభుత్వం నివేదికలో పేర్కొన్న విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి పిటిషనర్ తరపు న్యాయవాది శ్రావన్ కుమార్ తీసుకెళ్లారు. ప్రాజెక్టు తాత్కాలికమే అయినప్పుడు రైతుల భూములను వెనక్కి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిహారం కింద రూ.2.40 కోట్లు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి చెల్లిం చడానికి బదులు భూములు, ఉపాధి కోల్పోయిన రైతులకు పరిహారంగా చెల్లించాలని కోరారు. కమిటీ సిఫార్సు చేసిన పర్యావరణ పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎపి ప్రభుత్వ తరపున సీనియర్ న్యాయవాది వెంకట రమణి తెలిపారు. డబ్బు డిపాజిట్ చేసేందుకు కొంత సమయం కావాలని కోరారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంపై వట్టి వసంత కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఎన్‌జిటి విచారణ జరిపింది.

# ఇంచార్జీలతో దేవాదాయ శాఖ

విజయవాడ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారులు (ఇఒ) పోస్టులు దశాబ్దాలుగా భర్తీకి నోచుకోకపోవడం ఆ శాఖ పాలిట శాపంగా మారింది. కొత్త రిక్రూట్‌మెంట్ లేకపోవడం, ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జి ఇఒల పాలనలో ఆలయాలను నెట్టుకురావడం పరిపాటిగా మారింది. దాతలు ఆలయాల నిర్వహణకు పూర్వం ఉచితంగా ఇచ్చిన భూముల ధరలకు రెక్కలు రావడంతో వాటిని రక్షించడం ఆ శాఖ అధికారులకు కత్తిమీద సాములా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1500కు పైగా ఆలయాలుంటే ఇందులో గ్రేడ్ 1, 2, 3, ఇఒలు పనిచేసే ఆలయాలు 746 ఉన్నాయి. నేటికీ 258 ఆలయాలకు రెగ్యులర్ ఇఒలు లేరు. దీంతో కొందరు రాజకీయ నాయకులు, ఆలయాల పాలకమండలి సభ్యులు, అధికారులతో కుమ్మక్కై పలు ప్రాంతాల్లో ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో ఇఒ 10 నుంచి 15 ఆలయాలకు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆ శాఖలో వరుసగా ఉన్నతాధికారులు సైతం సస్పెండ్లకు గురవుతుండటం, కొందరు ఉద్యోగులను ప్రభుత్వానికి సరెండర్ చేయడం జరుగుతోంది. మాన్సాస్ ట్రస్టు భూములు, సింహాచలం ఆలయ భూములు మాయం, రికార్డుల్లో పేజీలు గల్లంతు సంఘటనల్లో అప్పట్లో ఇఒగా పనిచేస్తూ ప్రస్తుతం దేవాదాయుశాఖ అడిషనల్ కమిషనరు-2గా పనిచేస్తున్న కె.రామచంద్రమోహన్‌తోపాటు అప్పటి అసిస్టెంట్ కమిషనరు సుజాతను ప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. అంతేకాకుండా బొబ్బిలిలో నాలుగు వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయంటూ ఆ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు శనివారం ఆరోపించారు. అలాగే విశాఖపట్నం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనరు శాంతి, డిప్యూటీ కమిషనరు పుష్పవర్ధన్ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, డిటి ముఖంపై ఎసి శాంతి ఇసుక చల్లిన ఘటన దేవాదాయ శాఖలో లోపించిన క్రమశిక్షణకు అద్దంపడుతోంది. దేవాదాయ శాఖలో అత్యంత కీలకమైన కమిషనరు పోస్టుకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో కింది స్థాయి అధికారులపై పర్యవేక్షణ కొరవడింది. ఇటీవల కాలం వరకు స్పెషల్ కమిషనరు హోదాలో పి.అర్జునరావు కమిషనరు బాధ్యతలు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో ఆయనను చేనేత జౌళిశాఖ డైరెక్టరుగా ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్ కమిషనరు బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. రామచంద్రమోహన్ ఇప్పటికే సస్పెండ్ కాగా, మరో అదనపు కమిషనరు ఆజాద్ పలు ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్నారు. పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రమంలో దుర్గ గుడి ఇఒ సురేష్‌బాబును ప్రభుత్వానికి సరెండర్ చేసి, అనతికాలంలోనే రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనరుగా నియమించడం చూస్తుంటే ఆ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని పలువురు భావిస్తున్నారు.

## సింహాచలం ఉపాలయంలో కూలిన ధ్వజస్తంభం

విశాఖశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉపాలయం సీతారామాలయంలో ధ్వజస్తంభం కూలిపోయింది. బుధవారం ఉదయం 6:30 ప్రాంతంలో కూలిపోయింట్లు సీసీ ఫుటేజ్ లో అధికారులు గుర్తించారు. దాదాపు 60 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఈ ధ్వజస్తంభం లోపలి కర్ర పూర్తిగా చెదలుపట్టడమే కారణంగా అనుమానిస్తున్నారు. వేద మంత్రాలు, సంప్రోక్షణ తర్వాత ధ్వజస్తంభం స్థానంలో తాత్కాలిక ధ్వజస్తంభం ఏర్పాటు చేసారు. ఈఓ సూర్యకళ మాట్లాడుతూ పది రోజుల్లో శాశ్వతంగా కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటు చేస్తామని అన్నారు.

## వైఎస్సార్ అవార్డుల ఉత్సవాలు వాయిదా

అమరావతి వైయస్సార్ లైఫ్టైం ఎచీవ్మెంట్, వైయస్సార్ ఎచీవ్మెంట్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం వాయిదా పడింది. ఈనెల 13న నిర్వహించాల్సిన ఈకార్యక్రమాన్ని అక్టోబరు లేదా నవంబరు నెలల్లో నిర్వహించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అవార్డు గ్రహీతల్లో పెద్ద వయస్సు ఉన్నవారు ఉండడటంతోపాటు, 150 మందికి మించి ఎక్కడా కూడా ప్రజలు గుమికూడదన్న వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు నేపథ్యంలో అవార్డుల కార్యక్రమాన్ని వాయిదావేస్తున్నట్టుగా ప్రభుత్వం వెల్లడించింది. అవార్డు గ్రహీతల వయస్సు, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, అలాగే వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని వాయిదా వేశామని, వచ్చే అక్టోబరు లేదా నవంబరు నెలల్లో ఒక రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

## జంట హత్యల కేసు..నలుగురు ఆరెస్టు

మైదుకూరు జిల్లా వ్యాప్తంగా కలకలం రేపిన డి. నేలటూరు గ్రామంలో జరిగిన జంట హత్యల కేసులో నలుగురు ముద్దాయిలను బి.మఠం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని మైదుకూరు డిఎస్పి విజయ్ కుమార్ పత్రికా ముఖంగా తెలిపారు. 2012లో జరిగిన చరిష్మా హత్య కు ప్రతీకారంగా, చరిష్మా అత్త, అడపడుచులైన అంజనమ్మ, వరలక్ష్మి లను ఈనెల 6వ తేదీన చరిష్మా రక్త సంబంధీకులు హత్య చేసిన నేపథ్యంలో... చరిష్మా తండ్రి బడబాగ్ని రామాంజనేయ రాజు, చిన్నాన శ్రీనివాస రాజు, వెంకట వరప్రసాద్ రాజు, నారాయణమ్మ లను అరెస్టు చేసి వారి వద్ద నుండి హత్యకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురుని... వరకట్న వేధింపులతో పెళ్ళైన ఆరు నెలలకే అత్తింటి వారు హత్య చేయడంతో జీర్ణించుకోలేక పోయిన తండ్రి రామాంజనేయ రాజు ఒక పథకం ప్రకారం రప్పించి కూతురి సమాధి వద్దే హత్య చేశారని తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించి, ముద్దాయిలను అదుపులోకి తీసుకున్న సీఐ కొండా రెడ్డి, ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది ని జిల్లా ఎస్పీ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు.

## నాడు నేడు పనులపై ప్రిన్సిపాల్ సెక్రటరీ రాజశేఖర్ ఆగ్రహం

పి గన్నవరం నాడు నేడు పనులపై ప్రిన్సిపాల్ సెక్రటరీ రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈనెల 16వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనలో భాగంగా పి.గన్నవరం జడ్పీ హైస్కూల్ ను అయన బుధవారం పరిశీలించారు. స్కూల్ పనుల తీరుపై మండిపడ్డారు. ఇంత నాసిరకం పనులు ఎక్కడా చూడలేదు అంటూ మండిపడ్డారు. పెయింటింగ్, టైల్స్ నాణ్యమైనవి వాడకుండా లోకల్ వి వాడుతున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. టైల్స్ మార్చాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రభుత్వ స్కూళ్లల్లో మౌలిక వసతులు

నూజివీడు ఆగస్టు 11, (న్యూస్ పల్స్)అటానమస్ సెంటర్గా నూజివీడు పిజి సెంటర్ ను తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం నాడు నూజివీడు కృష్ణా యూనివర్సిటీ (పి జి సెంటర్)లో ఎకాడమిక్ బ్లాక్ శంకుస్థాపన చేసారు. 6 కోట్లతో నిర్మించనున్న నూతన ఎకడమిక్ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కృష్ణ యూనివర్సిటీ రిజిస్టర్ వై కె సుందర్, వైస్ ఛాన్సర్ చంద్రశేఖర్ తదితరుల తో మంత్రి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా చరిత్ర గల టీవీ సెంటర్కు పరిపాలన లేకపోవడం బాధాకరం. విద్య పై ఉన్న మక్కువతో జమీందార్లు ఈ ప్రాంతాన్ని విద్యా సంస్థలు స్థాపించి ఎంతో అభివృద్ధి చేశారు. వాషింగ్టన్ డి సి లో నూజివీడు క్లబ్బు పెట్టడం గొప్ప విషయం. భవనాల ద్వారా చరిత్రకు పేరు రాదు విద్యార్థులు ఉన్నత చదువులు చదవడం ద్వారా సాధ్యమవుతుంది. నేటితరం అవసరాలకు అనుగుణంగా విద్యాలయాలు మార్పులు చెందాలి. ఇంజనీరింగ్ విద్యలో ఇంటర్న్ షిప్ ద్వారా విద్యార్థులు నైపుణ్యం సంపాదించుకోవాలి. 3600 కోట్లతో నాడు స్కూల్ నేడు స్కూల్ అభివృద్ధి చేయడం జరిగింది. 2 సంవత్సరాల కాలంలో ప్రాథమిక విద్య లో మార్పులు చేసి నిధులు మంజూరు చేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిది. కార్పొరేట్ స్కూల్లో దీటుగా ప్రభుత్వ స్కూల్లో అనేక మౌలిక వసతులతో రూపాంతరం చెందిందని అన్నారు.జూనియర్ కళాశాలలో కార్పొరేట్ చేతిలో ఉండేవి గత ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేశాయి ఎల్ కే జి నుండి తమ పిల్లలకు మంచి విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. విద్యార్థులను గ్లోబల్ సిటిజెన్స్ గా తీర్చిదిద్దేందుకు విద్యా విధానంలో అనేక మార్పులు చేర్చాం. 45 సంవత్సరాల నుండి పిజి సెంటర్ లో ఉన్నత స్థాయికి రాకపోవడం చాలా బాధాకరం అప్లైడ్ మ్యాథమెటిక్స్, ఇతర సబ్జెక్టులలో పి జి సెంటర్ లో ఉండేలా చర్యలు చేపడతాం. ఛాయిస్ బేస్ లు క్రెడిట్ సిస్టం ద్వారా విద్యార్థులు సబ్జెక్టులు మార్చు కునే విధంగా చదువుకునే వెసులుబాటు కల్పిస్తామని అన్నారు.

# వివాహాలు, సమావేశాలకు గరిష్టంగా 150 మందికి మాత్రమే అనుమతి

**జిల్లా కలెక్టరు వి.విజయరామరాజు**

**కోవిడ్ -19 వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ**

**సెప్టెంబరు 30వరకు నిబంధనలు అమలు**

కడప, ఆగస్టు 11 కోవిడ్-19 నియంత్రణలో భాగంగా వివాహాలు, సంఘాలు, మతపరమైన, ఇతరత్రా అన్ని సమావేశాలకు గరిష్టంగా 150 మందికి మాత్రమే అనుమతించడం జరుగుతుందని జిల్లా కలెక్టరు వి.విజయరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. కోవిడ్ -19 వ్యాప్తిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. పరీక్ష-ట్రేస్-ట్రీట్మెంట్-టీకా ద్వారా ప్రజలలో కోవిడ్ వ్యాప్తిని నిరోధించడం పై ప్రభుత్వం దృష్టి సారించి ఈ మేరకు కోవిడ్ -19 పరిస్థితిని సమీక్షించిన పిదప సమూహాలు గుమికూడే అవకాశం ఉన్న వివాహాలు, సంఘాలు మరియు మతపరమైన సమావేశాలు తదితరాలపై కింది మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. 1. వివాహాలు, సంఘాలు, మతపరమైన సమావేశాలు మొదలైన అన్ని సమావేశాలు పాల్గొనేవారికి గరిష్టంగా 150 మందిని మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వారందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించడం, తరచుగా చేతులు శుభ్రపరచడం మరియు సామాజిక దూరాన్ని పాటించడం తదితర కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఇంకా, ఏదైనా బహిరంగ ప్రదేశంలో లేదా వేదికలు స్థిరమైన సీట్లు ఉన్న చోట, భౌతిక దూరాన్ని నిర్వహించడానికి ప్రత్యామ్నాయ సీట్లు ఖాళీగా ఉంచాలన్నారు. స్థిర సీటింగ్ లేని ప్రదేశాలు లేదా వేదికలలో ఐదు అడుగుల దూరం నిర్వహించాలి. 2. పైన పేర్కొన్న వాటిలో పాల్గొన్న సమూహాలు నిబంధనలను ఉల్లంఘిస్తే... విపత్తు నిర్వహణ చట్టం, 2005 సెక్షన్ 51 నుండి 60 మరియు ఐపిసి సెక్షన్ 188 ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేయబడతాయి. 3. కోవిడ్ వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం జారీ చేసిన ఈ సూచనలు సెప్టెంబరు 30 వరకు అమలులో ఉంటాయన్నారు.

# కోల్‌కతా కరోనా రోగుల్లో మూడొంతులు టీకా తీసుకున్న వారే



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ఆసుపత్రుల్లో అడ్మిట్ అయిన కరోనా రోగుల్లో టీకా తీసుకున్న వారే మూడొంతులు ఉన్నారు. నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరిన కరోనా పాజిటివ్ రోగుల్లో మూడొంతుల మంది వ్యాక్సిన్ ఒక డోసు లేదా పూర్తిగా రెండు డోసులు తీసుకున్నవారేనని వైద్యులు తెలిపారు. తేలికపాటి లక్షణాలున్న రోగులు మందులతో కోలుకుంటున్నారని, ఇతర అనారోగ్య సమస్యలున్నవారికి ఆక్సిన్ సపోర్ట్ అవసరమవుతున్నదని చెప్పారు.ఏఎంఆర్ఐ ఆసుపత్రిలో 24 మంది కరోనా రోగులు చేరినట్లు సీఈవో రూపక్ బారువా తెలిపారు. వీరిలో 60 శాతం మంది కనీసం ఒక డోసు టీకా తీసుకున్నవారేనని చెప్పారు. వీరిలో 15 మంది ఐసీయూలో ఉన్నట్లు వెల్లడించారు. క్రిటికల్ రోగులకు టీకా తొలి డోసు తీసుకున్న వెంటనే కరోనా సోకి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.కోల్‌కతాలోని సీఎంఆర్ఐ ఆసుపత్రిలోనూ ఇదే పరిస్థితి. 13 మంది కరోనా రోగుల్లో 9 మంది టీకా వేయించుకున్నారని పల్మనాలజీ డైరెక్టర్ రాజ ధర్ తెలిపారు. 9 మందిలో ఒకరు పూర్తిగా, 8 మంది ఒక డోసు టీకా తీసుకున్నారని చెప్పారు. అయితే టీకా వేయించుకోని వారి కంటే తీసుకున్న వారిలో ప్రాణ ముప్పు తక్కువేనని అన్నారు. కాగా, నగరంలోని పలు ఆసుపత్రుల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

# నేతన్న నేస్తం పేరుతో నమ్మక ద్రోహం

**నిజమైన నేతన్నలకు దక్కని నేతన్న నేస్తం**

**ప్రచార ఆర్భాటమే తప్ప ఆదుకోవాలనే ఆశయం లేని పథకాలు**

**కడప అసెంబ్లీ టీడీపీ ఇన్ఛార్జ్ వి.ఎస్.అమీర్ బాబు**

కడప ఆగస్టు11 పంచె ఊడబీకి గోచీ ఇచ్చినట్టు చేనేత కార్మికుల పట్ల జగన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని కడప అసెంబ్లీ టీడీపీ ఇన్ఛార్జ్, వి.ఎస్.అమీర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈరోజు కడప 2వ డివిజన్లోని తిలక్ నగర్లో చేనేత కళాకారులకు నేతన్న నేస్తం పథకం ఎలా అమలు చేస్తున్నారో క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వి.ఎస్.అమీర్ బాబు మాట్లాడుతూ రాయితీలు, ప్రోత్సాహకాలను పూర్తిగా ఆపేసి.. నేతన్న నేస్తం పేరుతో హడావుడి చేస్తున్నారు. కూలితో సంబంధం లేకుండా ఏడాదికి రూ.50 వేలు వచ్చే అదనపు ఆదాయాన్ని నిలిపేసి.. రూ.24 వేలు చేతిలో పెట్టి పండగ చేసుకోమంటోందని ఎద్దేవా చేశారు. నిజమైన నేతన్నలకు నేతన్న నేస్తం దక్కడం లేదు. రాజకీయ ప్రలోభలతో మీ స్వామిభక్తి పరాయణులకే దక్కుతుంది. నేతన్నలకు మీ తాత సొమ్ము ఇస్తున్నారా జగన్ రెడ్డి..? అని ఘాటుగా విమర్శించారు. రాజకీయంగా అబద్ధాలు చెప్తే చేనేత రంగం అభివృద్ధి అవ్వదు. నేతన్న నేస్తం పథకాన్ని చేనేత కార్మికులకు అందరికీ అందిస్తున్నారా..? ఎంతమందికి ఈ పథకాన్ని ఇస్తున్నారో వైసీపీ నాయకులు గుండెమీద చేయి వేసుకొని చెప్పాలని నిలదీశారు. జగన్ రెడ్డి నీతి మాలిన ఆంక్షలు పెట్టి, చేనేత వృత్తులు చేసే వారంటే అంత చులకనా..? అని ప్రశ్నించారు.చేనేత రంగాన్ని అభివృద్ధి చేయాలంటే కార్మికుడికి ప్రోత్సాహకాలు రాయితీలు కల్పించాలి. చేనేత సహకార సంఘంలో ఉన్న ఒక్కో కార్మికుడు నెలకు సుమారుగా 40-50 బార్ల పని చేస్తారు. ఒక్కో బారుకు రూ.1,000 వరకు ప్రోత్సాహకం ఉంటుంది. అంటే ఏటా రూ40-50 వేల వరకు ప్రోత్సాహకం అందుతుంది. ఈ ప్రోత్సాహకాన్ని జగన్ రెడ్డి నిలిపివేశారని మండిపడ్డారు. నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు ఇస్తున్నందున ఇతర ప్రోత్సాహకాలు అవసరం లేదని తేల్చి చెప్పారు. చేనేతలకు నేతన్న నేస్తం పథకాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన జగన్ రెడ్డి.. అర్హుల ఎంపిక విషయంలో మాత్రం చేనేతలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. చేనేత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చడం కోసం టీడీపీ హయాంలో ప్రతి ఏటా రూ.250 కోట్లకి పైగా బడ్జెట్ కేటాయించాం. రూ.110 కోట్ల చేనేతల రుణాలను మాఫీ చేశాం. వర్షాకాలంలో పనులు లేనందున ప్రతి చేనేత కుటుంబానికి రూ.8 వేలు భృతిగా అందించాం. 100 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించి అండగా నిలిచామని గుర్తుచేశారు.జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతి రంగాన్ని మోసం చేసినట్లుగానే చేనేత రంగాన్ని, వారికి సంక్షేమం పేరుతో అప్పటి వరకు అందుతున్న అన్ని పథకాలను రద్దు చేసి ద్రోహం చేశారని విమర్శించారు. చేనేతల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం చేసిందేమిటి...? రూపాయి రుణం అందించలేదని వైసీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గతంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల వరకు రుణాలు అందేవి. అందులో లక్ష రూపాయలు సబ్సిడీ వచ్చేది. వర్షాకాలంలో ఇచ్చే రూ.8 వేలు భృతిని రద్దు చేశారు. నూలు, రంగులపై అందించే సబ్సిడీని విద్యుత్ సబ్సిడీని ఎత్తేశారు. ఇంకా చేనేతల కోసం చేసిందేంటి...? ఇదేనా చేనేత సంక్షేమం...? ఇదేనా చేనేతలకు అందించే ఊతం...? అని జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. 50 సంవత్సరాలు దాటిన చేనేతలకు రూ.2000 చొప్పున 1.11లక్షల మందికి పెన్షన్ ఇచ్చాం. ప్రతి చేనేత కార్మికుడికి రూ.2లక్షలు రుణాలిచ్చి అందులో లక్ష సబ్సిడీ ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో చేనేతలకు సంబంధించిన జన గణన కూడా చేయలేదని విమర్శించారు.

# బ్యాంక్ లావీదేవీలపై సీబీఐ అధికారులు ఆరా

కడప, ఆగస్టు 11, (న్యూస్ పల్స్)మాజీ మంత్రి, ముఖ్యమంత్రి జగన్ బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా కడప సెంట్రల్ జైల్ గెస్ట్ హౌస్‌కు కర్ణాటక నుంచి బ్యాంకు అధికారులు, రెవెన్యూ సిబ్బంది వచ్చారు. వారి దగ్గర ఉన్న వివేకాకు సంబంధించి బ్యాంకు లావాదేవీలు, రెవెన్యూ రికార్డులను సీబీఐ అధికారులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే కడప ఎస్‌బీఐకు చెందిన ముగ్గురు అధికారులను కూడా సీబీఐ ప్రశ్నించింది. అలాగే వివేకా కుమార్తె, అల్లుడు కూడా ఎస్‌బీఐ అధికారుల్ని కలిశారు.మరోవైపు పులివెందులలో సునీల్ కుమార్ యాదవ్ నివాసానికి సీబీఐ అధికారులు వెళ్ళారు. ఇటీవల సునీల్ కుటుంబ సభ్యులు మీడియా సమావేశం నిర్వహించడంపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏలు విచారణకు వెళ్లారు. పులివెందుల ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో 8 మంది అనుమానితులను సీబీఐ అధికారులు ప్రశ్నించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారిని ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం మరో ఏడుగురు అనుమానితులు సీబీఐ విచారణకు హాజరయ్యారు. వీరిలో కడప ఎంపీ అవినాష్ రెడ్డి పీఏలు రాఘవరెడ్డి, రమణారెడ్డిలతో పాటు హోంగార్డు నాగభూషణం, వేంపల్లికి చెందిన రహంతుల్లా, బండి కేశవ, మల్లీ అనే వ్యక్తులను ప్రశ్నించారు.2019 మార్చి 15న వివేకా హత్య జరిగిన రోజు పులివెందుల సీఐగా పని చేసి ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్న శంకరయ్యను విచారణకు పిలిచారు. ఆయన్ను కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రశ్నించారు. మరో పత్రికా విలేఖరిని కూడా విచారణకు పిలిచారు. వివేకా హత్య జరిగిన రోజు ముందుగా గుండెపోటుగా ప్రచారం చేసింది ఎవరనే దానిపై విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# అక్కడ దళిత బందు-ఇక్కడ దళిత బొంద

విశాఖపట్నం ఆగస్టు 11, (న్యూస్ పల్స్)రాష్ట్రం లో వైసిపీ ప్రభుత్వం ఏర్పడ్డాక దళితులను అణగదొక్కే విదంగా ముఖ్య మంత్రి జగన్ మోహన రెడ్డి పాలన సాగిస్తున్నారని విశాఖ లో దళిత సంఘాల నేతలు నిరసనలు తెలియజేశారు . స్థానిక అంబేద్కర్ భవన్ లో దళిత సంఘాలు ఐక్య వేదిక ఆధ్వర్యంలో 'అక్కడ దళిత బందు-ఇక్కడ దళిత బొంద 'అనే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు వెంకట రావు మాట్లాడుతూ తెలంగాణ లో దళిత బందు లా కేసీఆర్ పాలన సాగుతుంటే ఆంధ్రప్రదేశ్ లో మాత్రం జగన్మోహనరెడ్డి దళితులను బొంద పెట్టాలని చూస్తున్నాడని మండి పడ్డారు. జగన్మోహనరెడ్డి ముఖ్య మంత్రి అయిన నుంచి నేటి వరకు ఎస్సీ లకు ఒక్క రూపాయి కూడా రుణ సహాయం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ లను విడదీసి మూడు కార్పొరేషన్ లుగా చేశారని, నిదులు మాత్రం లేవని ఎద్దేవా చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిదులు ఏర్పాటు చేసి కేంద్రం నుంచి రావాల్సిన వాటా తీసుకురావాలని డిమాండ్ చేశారు. తక్షణమే అర్హులైన దళితులందరికీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జేఏసీ నేతలు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రంలో తీరని కష్టాలు... క్యూలో బారులు తీరిన గిరిజనులు

విశాఖపట్నం ఆగస్టు 11, (న్యూస్ పల్స్)అరకులోయ మండలకేంద్రం లో ఆధార్ కేంద్రం ఉన్నపటికీ గిరిజనులకు తీరని కష్టం ప్రభుత్వ పథకాలు ప్రతిదీ ఆధార్ అనుసంధానం చేయడంతో గిరిజను అష్టకష్టాలు పడుతున్నారు ప్రతిరోజు ఆధార్ కేంద్రంలో బారులు తీరి ఉంటున్నారు వృద్ధులు తల్లీ పిల్లలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు మారుమూల ప్రాంతాల్లో నుండి వచ్చి ఉదయం 5గంటల నుండి పడిగాపులు కాసిన చివరకు నెట్ వర్క్ పనిచేయటం లేదని ఆధార్ కేంద్రం ఆఫరేటర్లు చెప్పటం సర్వసాధారణం తీరిగి గ్రామాలకు ప్రయాణం అవుతున్నారు దీనిపై ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు

## కులం పేరుతో రాజకీయాలు చేసే వారు ఇప్పుడేమంటారు

**కులం, మతం కాదు మానవత్వముండాలి...!**

కడప ఆగస్టు11కడపలోరెడ్డి కాలనీలోని తన కార్యాలయంలో కడప నగర టీడీపీ అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండా రెడ్డి మీడియాతో మాట్లాడారు. అచ్చితా రెడ్డి తాడిపత్రి మండలంలో ఒక పల్లెకు చెందిన యువతి. ఆమె నాన్నని ఫ్యాక్షన్ ప్రత్యర్థులు చంపేశారు. అలాంటి పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చదివించారు. ఇప్పుడు ఆ అమ్మాయి సివిల్స్ దాకా ఎదిగింది. కులంకులం అని గింజుకునే వాళ్లకు ఇదే కనువిప్పు కావాలని అన్నారు. కులం చూడం. మతం చూడం. పార్టీలు చూడం అని పదేపదే అరిగిపోయిన గ్రామపోన్ రికార్డు లాగా చెప్పేదే కానీ పాటించేది లేదు. చెప్పేవి శ్రీరంగ నీతులు దూరేది గుడిసెలు అనే చెప్పే నానుడి మాదిరి ఉంది జగన్ రెడ్డి ప్రభుత్వ తీరు అని విమర్శించారు. రాజకీయాలకి కాకుండా మానవత్వానికి విలువ ఇచ్చే పార్టీ ఎదో ఇప్పుడు అర్థమైందా...! చావుల్ని అడ్డం బెట్టుకుని... బుగ్గలు నిమిరి ముద్దులు పెట్టి అధికారంలోకి వచ్చాక జగన్ రెడ్డి మాట, మడమే కాదు ఫుల్ టర్న్ ఇచ్చేశాడని అన్నారు. చంద్రబాబు నాయుడు ఆరడుగుల నాయకుడే కాదు...వ్యక్తిత్వానికి నిలువుటద్దమని అన్నారు. ఈ సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, నగర డివిజన్ ఇన్చార్జ్ సజ్జా సాయి పాల్గొన్నారు.

## పేదలకు సహాయం చేయడం అభినందనీయం

**ములుగు ఏఎస్పీ పోతరాజు సాయి చైతన్య**

**ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

**నిత్యవసర సరుకులు పంపిణీ**

ములుగు అగస్ట్ 11 చిన్న వయస్సులోనే పేదలకు సహాయం చేయడం అభినందనీయమని ములుగు ఏఎస్పీ పోతరాజు సాయి చైతన్య ఆన్నారు.ములుగు జిల్లాలోని పాత గోదాం అవరణలో గుడారాలు వేసుకొని నివసించే దాదాపు 30 నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఇల్లు మరియు గుంట భూమి కూడా లేకుండా అక్కడక్కడ నివాసం ఉండు కుంట కాలం ఏళ్ళదిస్తున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఆకుతోట అన్వేష్ బుధవారం రోజున ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 30 నిరుపేద కుటుంబాలకు కుటుంబానికి 5 కిలోల బియ్యం మరియు 9 రకాల నిత్యవసర సరుకులు (పసుపు, కారం,ఉప్పు,అల్లం,సబ్బులు,చెక్కెర, చపత్త, కాల్గాటే పేస్ట్,నూనె) వస్తువులను అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు ఏఎస్పీ పోతరాజు సాయి చైతన్య మరియు సిఐ శ్రీధర్ హాజరై సరుకులను అంధియడం జరిగింది. ఏఎస్పీ మాట్లాడుతూ అన్వేష్ ఇంత చిన్న వయసులోనే పేదలకు సహాయం చేసే కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరం అదేవిదంగా ఇలానే చేస్తూ యువతకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాలింటర్స్ అకుతోట సంపత్, సిద్దు, నాగరాజు,పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు వేధిస్తున్నారంటూ యువకుడు ఆత్మహత్య

రాజమహేంద్రవరం పోలీసులు వేధిస్తున్నారంటూ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నా చావుకి పోలీసులే కారణమని సెల్ఫీ వీడియో విడుదల చేసిన పిచ్చికి మజ్జి అనే యువకుడు... ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంవత్సరం క్రితం తెలంగాణ నుండి రాజమహేంద్రవరం వస్తు రెండు మద్యం బాటిల్స్ తీసుకొస్తుంటే జగ్గయ్యపేట దగ్గర ఉన్న చిల్లకల్లు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో కొంత మొత్తంలో డబ్బు తీసుకుని మజ్జిని వదిలేశారు. సంవత్సరం తర్వాత కానిస్టేబుల్ శివ ఫోన్ చేసి సెటిల్ చేసుకోకపోతే ఇబ్బంది పడతావు అని చెప్పడంతో మజ్జి చిలకల్లు వెళ్లాడు. లక్ష రూపాయలు డిమాండ్ చేసిన కానిస్టేబుల్ శివ లేదంటే గంజాయి కేసు పెడతానని బెదిరించాడు. తిరిగి వచ్చి ఈరోజు ఉదయం రాజమండ్రి రూరల్ పిడుంగొయ్య గ్రామంలో ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అమరజీవి కామ్రేడ్ జి. అయ్యప్ప గౌడ్ సంస్మరణ సభ



ఆదోని ఆగస్టు 11, ( విభారె) :పట్టణంలో కామ్రేడ్ అయ్యప్ప సంస్మరణ సభ స్థానిక శ్రీ మంగళ ఆంజనేయ స్వామి దేవాలయం లో నిర్వహించారు. ఈ సభకు పట్టణ మండల కార్యదర్శులు కే సుదర్శన్ బసాపురం గోపాల్ అధ్యక్షతన జరిగింది.ఈ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య విచ్చేసి ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని దొడ్డనకేరి గ్రామము లో గోరుకల్లు ఆంజనేయులు మాజీ సర్పంచ్ హనుమంతమ్మ గార్ల మూడవ కుమారుడిగా జన్మించిన కామ్రేడ్ ఉ. అయ్యప్ప గౌడ్ గారు బి.ఏ వరకు చదివి తమ గ్రామంతో పాటు ప్రక్కనే ఉన్న తారాపురం రంగాపురం గ్రామాలలో భూస్వామ్య అగ్రకులాలవారు చేస్తున్న అరాచకాలను వ్యతిరేకించడానికి ఆ గ్రామంలో ఉన్న వ్యవసాయ కార్మికులను దళితులను సమీకరించి కీర్తిశేషులు చదువుల రామయ్య ఓ .బాల నాగన్న నాయకత్వంలో 1988వ సంవత్సరములో దొడ్డనకేరి గ్రామము లో భారత కమ్యూనిస్టు ఏర్పాటు చేసుకుని పార్టీ ప్రజా సంఘాలను బలోపేతం చేస్తూ 1994వ సంవత్సరంలో దొడ్డనకేరి లో ఎంపీటీసీ సిపిఐ అభ్యర్థిగా గెలుపొందడం జరిగింది .ఆ సందర్భంగానే ఆ ప్రాంతంలో ఉన్న అటవీ బంజరు భూములను చెట్టు పట్టాల కింద వ్యవసాయ కార్మికులకు దళితులకు ఇవ్వాలని భూ పోరాటం కొనసాగించడం జరిగింది. ఈ కార్యక్రమానికి భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రఅగ్ర నాయకులను పోరాటంలో భాగస్వాములు చేయడం అనేక మందిపై అక్రమ భూ పోరాట కేసులు కూడా నమోదు చేయడం జరిగింది1996నుండి2003వరకు కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడిగాపనిచేసారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆదోని మండల పట్టణ కార్యదర్శి బాధ్యతలు కూడా చేపట్టారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు గాను ప్రస్తుతం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యునిగాపనిచేస్తూ ఆదోని నియోజకవర్గంలో పార్టీ ప్రజా సంఘాలను బలోపేతం చేస్తూ బడుగు బలహీనవర్గాల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం చేస్తున్న తరుణంలో లో 29.4.2021 తేదీన మృత్యువు ఆయనను కబళించింది.కామ్రేడ్ అయ్యప్ప గౌడ్ చేసిన సేవలను స్మృతించు కోవడానికి తేదీ 11.8.2021న సంస్మరణ సభ ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం అధికారుల తోటి ప్రభుత్వం తోటి అభివృద్ధి పనులు చేయించుకునే వాడని ఆయన మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మిరెడ్డి, నబి ,రసూల్ ,భాగ్యలక్ష్మి పంపన్న గౌడ్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు అజయ్ బాబు ,టి వీరేష్ మిత్రులు డాక్టర్ జై కృష్ణ ఇబ్రహీం, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ , సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మల్లికార్జున, మణిమ్మ ,ఎస్టియు నాయకులు నాగరాజు ,నాగేంద్ర నరసింహులు ఆర్టీసీ నాయకులు లక్ష్మన్న వారి కుటుంబ సభ్యులు యశోదమ్మ అనీజిత్ రాజు పార్టీ ప్రజాసంఘాల నాయకులు ప్రజా సంఘాల నాయకులు రాజు బి నాగరాజు షేక్షావలి ఎంకన్న సిపిఐ పార్టీ నాయకులు విజయ్ లక్ష్మీనారాయణ శ్రీనివాసులు ఏ వైపు నాయకులు రమేష్ మహిళా సమైక్య నాయకులు కోటమ్మ మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బి.వి. ఆర్థిక సహాయం

ఎమ్మిగనూరుఆగస్టు 11, ( విభారె)- ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక 21వ వార్డులో నివాసముంటున్న ×ఎరుకుల లక్ష్మి గుడిసె మొన్న పడినటువంటి వర్షానికి పూర్తిగా నేలమట్టం కావడంతో ఆమె ఉండడానికి నివాసం లేకపోవడంతో కౌన్సిలర్ ఎ. ఉ. ం. దయ సాగర్ గారు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి గారి దృష్టి కి తీసుకోవడంతో ఆయన ఆదేశాల మేరకు కౌన్సిలర్ ఎ.ఉ.ం. దయాసాగర్ చేతుల మిదగా ఎరుకల. లక్ష్మి కి 4000/-రూపాయలు ఆర్థిక సహాయం అందజేసారు.ఈ కార్యక్రమంలో ఎరుకల నారాయణ,బోయ.హనుమంతమ్మ, బోయ.రంగం, గండం రవి తదితరులు పాల్గొన్నారు.



### మొహరం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి...

## ఎస్సై షామీర్ భాష

తుగ్గలి ఆగస్టు 11, ( విభారె): తుగ్గలి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించే మొహరం పండుగను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తుగ్గలి ఎస్ఐ షామీర్ భాష తెలియజేశారు. మంగళవారం రోజున తుగ్గలి మండలం పరిధిలోని శభాష్ పురం గ్రామం నందు మొహరం పండుగ నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు.మొహరం పండుగ వేడుకలలో ఎటువంటి అల్లర్లు,గొడవలు సృష్టించకుండా భక్తిశ్రద్ధలతో మొహరం పండుగ వేడుకలను నిర్వహించుకోవాలని గ్రామ పెద్దలకు,ప్రజలకు తెలియజేశారు.మొహరం పండుగ సమయంలో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.గ్రామాలలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఎస్సై ప్రజలకు తెలియజేశారు.

# అభివృద్ధి పథంలో మద్దిలేటి స్వామి దేవాలయం

### అంకితభావంతో పనిచేస్తున్న ఆలయ ఈ.ఓ పాండురంగారెడ్డి



కర్నూలుఆగస్టు 11, ( విభారె: బేతంచర్ల మండల పరిధిలోని ఆర్.ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ఘన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం రోజురోజుకు భక్తులతో కిక్కిరిసి పోతుంది దీనికి తోడు ఆలయ అభివృద్ధి రోజురోజుకు పుంజుకుంటుండమే విశేషం ఒక్కసారి మద్దిలేటి స్వామి గణ చరిత్రను చూసుకుంటే కొండకోనల మధ్య మధులేరు సెలయేరు ప్రవహించే ఎర్రమల అడవుల్లో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి వరాల దేవునిగా దినదినాభివృద్ధి చెందుతూ భక్తులపాలిట కొలిచే వారికి కొంగుబంగారం గా మారడం జరిగింది. స్వామివారి చరిత్ర పురాణ గాథల ఆధారంగా అనంతపురం జిల్లా కదిరి నరసింహుడు దేవేరి లక్ష్మి దేవి తో పాచికలు ఆడుతూ ఓటమితో అవమానాన్ని భరించలేక అక్కడి నుండి స్వామివారు అలిగి వచ్చి యాగంటి చేరుకున్నారు. యాగంటి లో కొలువై ఉన్న ఉమామహేశ్వరుని స్వామి, తనకు ప్రశాంతమైన ప్రాంతాన్ని సూచిస్తే అక్కడే ఉండి భక్తులకు సేవ చేస్తానని వేడుకున్నాడు. దీంతో ఉమామహేశ్వరుడు యాగంటి సమీపంలో ఉన్న ఎర్రమల కొండల ల్లో మదులేరు సమీపంలో కొలువై ఉండమని సూచించారు. ఆ మేరకు స్వామి వారు ఎర్రమల కొండలలోని మద్దులేరు సమీపానికి చేరుకున్న స్వామివార, అక్కడ ఉన్న భక్తులకు తెలియజేయాలని సంకల్పించాడ. ఇది పురాణాల ఆధారంగా మద్దిలేటి నరసింహస్వామి ఘణ చరిత్ర ఇలా వెలసిన మద్దిలేటి నరసింహ స్వామిని భక్తులు తమ కోర్కెలు తీర్చే దేవునిగా కొలుస్తున్నార. మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ భక్తులు సమర్పించే ఉండి కానుకలతో కార్య నిర్వహణ అధికారులు ఆలయాన్ని ఆదాయమలో పడి, భక్తుల సౌకర్యాలను మరిచారు. అన్నది భక్తుల ఆరోపన ఇదే పదం లో కొత్తగా ఆలయ కార్యనిర్వహణ అధికారి గా బాధ్యతలు చేపట్టిన పాండురంగారెడ్డి నాటినుండి నేటి వరకు భక్తుల ఇచ్చే చందాలతో లక్ష్మి దేవి ఆలయాన్ని నిర్మించి వాహ్వా అనిపించుకున్నారు. అదే పదం లో మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం బీటలు వారడంతో ఆలయాన్ని కూడా నిర్మించాలని ఆలోచనతో కోటి యాభై లక్షల రూపాయలతో ఆలయాన్ని పునర్ నిర్మించే కార్యక్రమాన్ని రూపుదిద్దారు. దీనికి తోడు ఆలయ చైర్మన్ సి. హెచ్ లక్ష్మి రెడ్డి సహకారంతో ఈ వీరిద్దరూ ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. బేతంచర్ల ముద్దుబిడ్డ అయినా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆర్థిక శాఖ మంత్రి కావడం ఈ ఆలయానికి కలిసి వచ్చిందని చెప్పాలి, ఆయన మద్దిలేటి నరసింహస్వామి దేవాలయం నుండి యాగంటి పుణ్య క్షేత్రానికి భక్తుల సౌకర్యార్థం రహదారిని వేయించారు.రాష్ట్రం నలుమూలల నుండి అనేక మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని సమర్పించిన కానుకల ఆదాయము లక్షల్లో ఉన్న గత అధికార వర్గం , పాలకవర్గం ఈ ఆదాయం ఎంత ఏం చేశారు అనే విషయం ఆ గణ మద్దిలేటి స్వామి కే తెలియాలి అని భక్తులు వినికిడి ఇప్పుడు పదవి బాధ్యతలు చేపట్టిన పాలకమండలి , ఆలయ ఈ. వో ఆధ్వర్యంలో అదే ఆదాయంతోనే ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఉన్నారు.

# ముగిసిన నూతన సర్పంచ్ ల శిక్షణా కార్యక్రమం

తుగ్గలిఆగస్టు 11, ( విభారె: పంచాయతీ ఎన్నికలలో బరిలో నిలిచి గెలిచి నూతనంగా ఎన్నిక కాబడిన గ్రామపంచాయతీ సర్పంచ్ ల శిక్షణా కార్యక్రమం నేటితో ముగిసింది.మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదోని పరిధిలోని ఆరెకల్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలకు అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచులు హాజరయ్యారు.ఈ శిక్షణా కార్యక్రమంలో అధికారులు గ్రామ పంచాయతీ లలో సర్పంచులు నిర్వహించవలసిన విధుల గురించి వివరించారు.గ్రామ పంచాయతీ అభివృద్ధి కొరకు చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి అధికారులు సర్పంచులకు వివరించారు.మూడు రోజుల శిక్షణ కార్యక్రమం అనంతరం శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులకు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి ధృవ పత్రాలను అందజేశారు.మూడు రోజుల శిక్షణ కార్యక్రమం అనంతరం తుగ్గలి మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామపంచాయతీ సర్పంచ్ ఎండ చౌడప్ప రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి చేతుల మీదుగా శిక్షణా కార్యక్రమ ధ్రువపత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లో వివిధ శాఖల అధికారులు,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.




# ఆరడుగుల బుల్లెట్'ను థియేటర్‌లో దింపబోతున్నారా..?



ఒక్కోసారి అంతే మరి.. అదృష్టం అడ్డం తిరిగితే అరటిపండు తిన్నా కూడా పన్ను విరుగుద్ది.. గోపీచంద్ (ఉనీజూతిఇఫ్రజీనిట) విషయంలో ఇదే జరుగుతుందిప్పుడు. ఈయన కెరీర్ లో ఓ సినిమా చాలా ఇబ్బందులు పెడుతుంది. ఆ సినిమా పేరు ఆరడుగుల బుల్లెట్ అన్నీ అనుకున్నట్లు జరిగుంటే ఈ సినిమా వచ్చి ఈ పాటికే 4 సంవత్సరాలు అయ్యుండేది. కానీ ఏం చేస్తాం.. కుదర్లేదంతే. నాలుగేళ్లుగా ఎప్పటికప్పుడు కొత్త రిలీజ్ డేట్స్ ప్రకటిస్తూ ఆ తర్వాత పూర్తిగా సినిమా విషయమే మరిచిపోయారు దర్శక నిర్మాతలు.నాలుగేళ్లుగా ఆర్థిక ఇబ్బందుల్లోనే ఉన్న ఈ చిత్రం ఇప్పుడు కూడా అదే ఆర్థిక ఇబ్బందుల్లో మునిగిపోయింది. ఈ సినిమాను భారీ క్యాస్టింగ్ తో భారీ బడ్జెట్ తో నిర్మించాడు తాండ్ర రమేష్. దాదాపు 18 కోట్లతో ఆరడుగుల బుల్లెట్ తెరకెక్కింది. ఈ చిత్రానికి ఇంకా బకాయిలు ఉన్నాయి. సినిమా విడుదలైన తర్వాత సెటిల్ చేస్తానని నిర్మాత చెప్పినా బయ్యర్లు వినడం లేదు. పక్కాగా డబ్బులు కట్టిన తర్వాత గానీ సినిమా విడుదల కానివ్వమంటున్నారు. దాంతో చేసేదేం లేక కామ్ గా ఉండిపోయాడు నిర్మాత. వక్కంతం వంశీ ఈ చిత్రానికి కథ అందించడం విశేషం. ప్రకాశ్ రాజ్, నయనతార లాంటి స్టార్ క్యాస్ట్ ఉంది. అన్నీ ఉన్నా..అల్లుడి నోట్లో శని అన్నట్లు ఆరడుగుల బుల్లెట్ పరిస్థితి తయారైంది.ఫైనాన్షియర్లకు క్లియర్ చేయాల్సిన అమౌంట్ ఇస్తే గానీ సినిమా విడుదల కాదు. ఇప్పుడు ఈ సినిమాను విడుదల చేద్దామని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. గోపీచంద్ కు యాక్షన్ హీరోగా మంచి ఇమేజ్ వుండటం.. నయనతార హీరోయిన్ కావడంతో ఈ సినిమాను మంచి రేటుకి తీసుకుంటామంటున్నాయి డిజిటల్ సంస్థలు. ఇప్పటికే ఓ ప్రముఖ ఓటిటి సంస్థ 15 కోట్లకు డీల్ కూడా మాట్లాడేసినట్లు తెలుస్తుంది. అయితే కొన్నేళ్ళ కింద జీ వాళ్ళకు ఈ చిత్ర శాటిలైట్, డిజిటల్ హక్కులు 8 కోట్లకు అమ్మేసినట్లు ప్రచారం జరుగుతుంది. దాంతో వాళ్లు ఆరడుగుల బుల్లెట్ ఓటిటి రిలీజ్ కు అడ్డు తగులుతున్నారు.తమకు అమ్మిన తర్వాత ఇప్పుడు రేట్ ఎక్కువ వచ్చిందని ఇతరులకు ఎలా అమ్మేస్తారంటూ వాళ్లు నిలదీస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఎలాగోలా అన్నీ క్లియర్ చేసి ఆగస్టులో విడుదల చేయనున్నట్లు నిర్మాతలే ఖరారు చేసారు. అయితే అంతా అనుకుంటున్నట్లు ఈ సినిమాను ఓటిటిలో కాకుండా థియేటర్స్ లోనే విడుదల చేద్దామని చూస్తున్నారు. అయితే అది అంత ఈజీ కాదు. థియేట్రికల్ రిలీజ్ అంటే ఓటిటికి ఎక్కువ రేటు వస్తుందని నిర్మాతలే ఈ ట్రిక్ ప్లే చేస్తున్నారని ట్రేడ్ పండితుల మాట. ఏదేమైనా కూడా ఈ బుల్లెట్ దిగితే చూద్దామని గోపీచంద్ అభిమానులు వేచి చూస్తున్నారు.




# చిరు చెల్లిగా కీర్తి, ఆమెకంత రెమ్యునరేషన్ అవసరమా!



కీర్తి సురేశ్ 'మహానటి' మూవీ తర్వాత మహిళ నేపథ్యం ఉన్న సినిమాలపై దృష్టి పెట్టింది. ఓ వైపు గ్లామర్ పాత్రల్లో నటిస్తూనే లేడి ఓరియంటెట్ చిత్రాలను ఎంచుకుంటుంది. ఈ క్రమంలో ఆమె నటించిన 'పెగ్విన్, మిస్ ఇండియా' చిత్రాలు అంతగా గుర్తింపు పొందలేదు. ఈ రెండు చిత్రాలు బాక్సాఫీసు వద్ద పరాజయం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె సైడ్ క్యారెక్టర్‌లోనూ నటించేందుకు సిద్దమైంది. స్టార్ హీరోలకు చెల్లెలి పాత్రల్లో నటించేందుకు కీర్తి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ క్రమంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న అన్నాత్తే మూవీలో రజనీకి సోదరిగా నటిస్తున్న సంగతి తెలిసిందే.ఇక తాజాగా మెగాస్టార్ చిరంజీవికి కూడా చెల్లిగా నటించేందుకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తమిళంలో హిట్‌గా నిలిచిన వేదాళం మూవీని చిరు ప్రధాన పాత్రలో మెహర్ రాజా రీమేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో చిరు సోదరి పాత్రకు దర్శక-నిర్మాతలు మొదట కీర్తిని సంప్రదించడంతో వెంటనే ఒకే చెప్పిందట. అంతేగాక ఈ మూవీకి భారీ మొత్తంలో పారితోషికం డిమాండ్ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే లేడి ఒరియంటెడ్ చిత్రాలకే అంత పారితోషికం తీసుకోనప్పుడు, సైడ్ క్యారెక్టర్‌కు అంత ఇవ్వడం ఎందుకని చిరు అభిప్రాయపడ్డారట. అంతేగాక ఈ విషయంపై ఆయన మేకర్స్‌ను వారించినట్లు వినికిడి. దీనిపై చర్చలు జరుగుతుండగానే కరోనా సెకండ్ వేవ్ కారణంగా షూటింగ్‌లు ఆగిపోవడంతో చిరు సలహా మేరకు కీర్తికి ప్రత్యామ్నాయం దర్శక-నిర్మాతలు మరో నటిని వేతికే పనిలో పడ్డారట.ఎవరు దొరకపోవడంతో మేకర్స్ కీర్తినే ఫైనల్ చేద్దామని చిరును ఒప్పించారట. అలా ఆమె అడిగినంత రెమ్యునరేషన్ ఇచ్చి కీర్తినే ఖారారు చేసేందుకు రెండోసారి ఆమెను సంప్రదించారట దర్శక-నిర్మాతలు. అయితే ఈసారి ఆమె మరో కోటి పెంచి మొత్తం 3 కోట్ల రూపాయలు డిమాండ్ చేసినట్లు టాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం లూసిఫర్ మూవీకి డేట్స్ ఇచ్చిన చిరు వేదాళం మూవీకి కూడా తన డేట్స్‌ను సర్దుబాటు చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నాడట. దీంతో త్వరలోనే వేదాళం మూవీని సెట్స్‌పై తీసుకొచ్చేందుకు మేకర్స్ సిద్దమవుతున్నారు. ఈ సమయంలో వేరే నటిని వేతకడం కంటే కీర్తినే ఫైనల్ చేమాలని నిశ్చయించుకుని, ఆమె అడిగినంత ఇచ్చేందుకు మేకర్స్ రేడి అయ్యారట. దీంతో మొత్తానికి కీర్తి తన రెమ్మునరేషన్ విషయంలో మాట నెగ్గించుకుందంటూ సినీవర్గాలు చర్చించుకుంటున్నాయి.

# టీమిండియా, ఇంగ్లండ్‌లకు షాకిచ్చిన ఐసీసీ



దుబాయ్: దుబాయ్: టీమిండియా, ఇంగ్లండ్‌లకు ఐసీసీ షాక్ ఇచ్చింది. నాటింగ్‌హమ్ వేదికగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత్, ఇంగ్లండ్ క్రికెట్ల జట్లకు ఐసీసీ జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 40 శాతం కోత విధించడంతో పాటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్(2021-23)కు సంబంధించి ఇరు జట్ల నుంచి రెండు పాయింట్లు కోత విధించింది. ఈ విషయాన్ని ఐసీసీ బుధవారం స్పష్టం చేసింది. ఇక తొలి టెస్ట్ విషయానికి వస్తే.. వరుణుడు అడ్డం పడడంతో మ్యాచ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 183 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 278 పరుగులకు ఆలౌట్ అయింది. తద్వారా 95 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఇంగ్లండ్ 303 పరుగులకు ఆలౌట్ అయింది. 208 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా వికెట్ నష్టానికి 52 పరుగులు చేసింది. ఆట ఆఖరిరోజు పూర్తిగా వర్షార్పణం కావడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇరు జట్ల మధ్య గురువారం(ఆగస్టు 12) నుంచి లార్డ్స్ వేదికగా రెండో టెస్టు జరగనుంది.

## ఆఫ్ఘనిస్తాన్ బౌలింగ్ కోచ్‌గా ఆసీస్ మాజీ ఫాస్ట్ బౌలర్

కాబుల్: ఆసీస్ మాజీ ఫాస్ట్ బౌలర్ షాన్ టైట్ ఆఫ్ఘనిస్తాన్ బౌలింగ్ కోచ్‌గా పనిచేయనున్నాడు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని.. ఐదు నెలల కాలానికిగానూ టైట్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించినట్లు ఆఫ్గన్ క్రికెట్ బోర్డు తెలిపింది. అక్టోబర్‌లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని టైట్‌ను నియమించినట్లు పేర్కొంది. కాగా షాన్ టైట్ ముందు పెద్ద సవాళ్లే ఉన్నాయి. పాకిస్తాన్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలుకొని.. ఆ తర్వాత శ్రీలంక పర్యటన.. అటుపై టీ20 ప్రపంచకప్ కీలకంగా ఉన్నాయి. ఇక టీ20 ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఉన్న గ్రూఫ్‌లోనే ఇండియా, పాకిస్తాన్, న్యూజిలాండ్ లాంటి పటిష్టమైన జట్లు ఉన్నాయి. టీ 20 ప్రపంచకప్ తర్వాత నవంబర్ 27నుంచి హోబర్ట్ వేదికగా ఆస్ట్రేలియాతో ఏకైక టెస్టు మ్యాచ్ ఆడనుంది.ఇక 2005లోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన షాన్‌టైట్ తరచూ గాయాల బారిన పడుతూ జట్టులో నిలకడగా కొనసాగలేకపోయాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190